క్లుప్తంగా

విశ్రాంత పోస్టుమాస్టర్‌కు నివాళి



సంతాపం తెలుపుతున్న మోహిత్ రెడ్డి

చంద్రగిరి : తొండవాడ గ్రామానికి చెందిన విశ్రాంత పోస్ట్ మాస్టర్ సావిత్రమ్మ ఆకస్మికంగా మరణించారు. దీనిపై సమాచారం అందుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం ఉదయం గ్రామానికి వెళ్లి సావిత్రమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, నరసింగాపురం సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

ట్యాక్సీ స్టాండ్ ప్రారంభం



ట్యాక్సీ స్టాండ్ ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ నేతలు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు మార్గంలోని శిల్పారామం సమీపంలో ఆదివారం శ్రీపద్మావతి ట్యాక్సీ స్టాండ్ ప్రారంభించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఐక్యమత్యంతో మెలగాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : ప్రొఫెసర్ సాయిబాబాకు సీపీఐ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈమేరకు ఆదివారం సీపీఐ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ డిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సాయిబాబా సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దివ్యాంగుడనే కనికరం కూడా లేకుండా బీజేపీ ప్రభుత్వం సుమారు 9 ఏళ్లపాటు సాయిబాబాను అక్రమంగా నిర్బంధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చలపతి, విశ్వనాథ్, ప్రజా సంఘాల నేతలు ఎన్‌డీ రవి, నాగరాజు, రామకృష్ణ, శ్రీరాములు, గోవిందస్వామి పాల్గొన్నారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పాకాల : సీపీఎం మండల ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రావు, కమిటీ సభ్యులుగా సాత్యకి, నరేంద్ర, లక్ష్మయ్య, సుగుణమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా నేత హేమలత తెలిపారు. ఆదివారం స్థానిక భారతంమిట్టలోని సీఐటీయు భవనంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ పేదలపై దాడులు, మహిళలపై లైంగిక దాడులను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల నేత ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ప్రారంభం



ఆటో స్టాండ్ ప్రారంభిస్తున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్ : రాఘవేంద్రనగర్‌లో శ్రీవివేకానంద ఆటో స్టాండ్‌ను ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నేతలు విశ్వనాథ్, వెంకటేష్, ఆటో యూనియన్ నేతలు శివ శ్రీనివాసులు, రవి, రాము, ప్రేమ్‌కుమార్, మురుగేష్ పాల్గొన్నారు.

ఘనంగా కోతకాల పండుగ

పాకాల : స్థానిక సీఎస్ఐ చర్చిలో కోతకాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని వివిధ రకాల కూరగాయలు, చెరుకు గడలు, పండ్లతో అలంకరించారు. పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన చేపట్టారు. పిల్లలు, మహిళలు, యువతకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆకృతి.. ఆరోగ్యం

ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తున్న యువత



ఫిట్‌గా ఉండాలి.. చక్కటి శరీర ఆకృతిని సాధించాలి.. ఆరోగ్యంగా జీవనం సాగించాలి.. ఇదే లక్ష్యంతో నేటి ఆధునిక సమాజం ఆలోచిస్తోంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేందుకు అడుగులు వేస్తోంది. ప్రత్యేకంగా నిపుణుల పర్యవేక్షణలో కసరత్తుకు ఆసక్తి చూపుతోంది. ఈ క్రమంలోనే తిరునగరంలోని పలు ప్రాంతాల్లో హైటెక్ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక పరికరాలతో యువత నుంచి వృద్ధుల వరకు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అయితే దేహ సామర్థ్యం మేరకే ఎక్సర్‌సైజ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. సరైన గైడెన్స్ లేకుండా గంటల తరబడి వ్యాయామం చేస్తే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

- ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెంచుకుంటున్న ప్రజలు
- తిరుపతి నగరంలో పలుచోట్ల వెలసిన హైటెక్ జిమ్‌లు
- అందుబాటులో అత్యాధునిక వ్యాయామ పరికరాలు
- సిక్స్ ప్యాక్ కోసం శ్రమిస్తున్న యువకులు
- పకడ్బందీగా శిక్షణ ఇస్తున్న నిపుణులు
- గైడెన్స్ పాటించాలంటున్న వైద్యులు
- ప్రొటీన్ డైట్ తప్పనిసరంటున్న న్యూట్రీషియన్లు

తిరుపతి సిటీ : నగరంలో అధునాతన పరికరాలు, హైటెక్ హంగులతో వ్యాయామశాలలు ఆకర్షిస్తున్నాయి. సిక్స్‌ప్యాక్ మోజుతో కొందరు, అందం కోసం మరికొందరు. ఊబకాయం సమస్యతో ఇంకొందరు జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు పురుషులు, స్త్రీలు అధిక సంఖ్యలో జిమ్‌లలో చేరి నిత్యం ఎక్సర్‌సైజ్‌లు ప్రాక్టీస్ చేస్తున్నారు.

సుమారు వందకు పైగా..

తిరుపతిలో హైటెక్ వ్యాయామశాలలతో పాటు సాధారణ జిమ్‌లు సుమారు వందకు పైగా ఉన్నాయి. ఇందులో ట్రెడ్‌మిల్, స్మిత్ మిషన్, మల్టీ పవర్ మిషన్, కిక్ బ్యాగ్, క్లైమ్ బింగ్స్, హాక్స్ స్క్వాడ్, ఎయిర్‌వాక్, మాగ్నెటిక్ రోవన్స్, సైక్లింగ్, డంబెల్స్, వెయిల్‌లిఫ్ట్ వంటి పరికరాలతో కస్టమర్లను ఫిట్‌గా తయారు చేస్తున్నాయి.

జుంబా డాన్స్‌కు క్రేజ్

నగరంలోని ప్రముఖ జిమ్‌లలో వెయిట్‌లాస్, సింపుల్ ఎక్సర్‌సైజ్‌ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జుంబా డాన్స్‌కు విపరీతమైన క్రేజ్ పెరిగింది. ఇందులో యువత నుంచి వృద్ధుల వరకు చేరుతున్నారు. అలాగే బాడీలోని వేస్ట్ వాటర్ కాంటెంట్‌ను తగ్గించేందుకు స్టీమ్ బాత్ పేరుతో ప్రత్యేక ట్రీట్ రూమ్‌లు, యోగాశాలలను కూడా జిమ్‌లలోనే ఏర్పాటు చేసి నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నారు.



జుంబా డాన్స్ ప్రాంగణం



ఎక్సర్‌సైజ్‌లో మెలకువలు నేర్పుతున్న జిమ్ ట్రైనర్



డంబెల్స్‌తో వ్యాయామం చేస్తున్న యువకులు



డిప్‌బంప్స్ చేయిస్తున్న ట్రైనర్

జాగ్రత్తలు తప్పనిసరి

- జిమ్‌కు వెళ్లాలనుకునే మందు డాక్టర్లను సంప్రదించాలి
- నిపుణుల పర్యవేక్షణ లేకుండా వ్యాయామం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది
- సరైన శిక్షకులు, ఆధునిక పరికరాలు ఉన్న జిమ్‌లో చేరడం మంచిది.
- తెలిసీ తెలియని పద్ధతులలో వ్యాయామం చేస్తే హార్ట్ ఎటాక్‌కు గురయ్యే అవకాశముంది.
- జిమ్‌కు వెళ్లేవారికి 50 శాతం డైట్, 25శాతం వర్క్‌ఔట్, 25శాతం డీప్‌స్లీప్ అవసరం
- డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నీరు, పండ్ల రసాలతోపాటు పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి
- జంక్, ఆయిల్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి
- బాడీ సామర్థ్యానికి తగ్గట్టు వ్యాయామ పద్ధతులను ఎంచుకోవాలి
- అధిక ఒత్తిడికి గురయ్యేవారు 15 నిమిషాలపాటు బ్రీతింగ్ వ్యాయామం చేయాలి.

సింపుల్ ప్రాక్టీస్ తప్పనిసరి



జిమ్‌లో చేరేవారు ముందుగా సింపుల్ ప్రాక్టీస్ చేయాలి. రోజూ గంటలోపే వ్యాయామం పూర్తి చేసుకోవాలి. ఎక్సర్‌సైజ్‌కు వయసుతో పనిలేదు. అయితే ఇష్టారీతిన కసరత్తు చేస్తే ప్రమాదమే. సిక్స్‌ప్యాక్ పేరిట గంటల తరబడి జిమ్‌లో శ్రమించడం మంచిది కాదు. ట్రైనర్లు నేర్పించే విధానాలను తూచా తప్పకుండా పాటించాలి. – వి.సేతురామ్, పీడీ, జాతీయ సంస్కృత వర్సిటీ

సలహాలు పొందాలి



ప్రతి ఒక్కరికీ శారీరక శ్రమ అవసరం. నగరవాసులు వ్యాయామంకోసం అధికంగా జిమ్‌లలో చేరుతున్నారు. ప్రధానంగా బరువు, ఎత్తు పరిగణలోకి తీసుకుని వారికి అవసరమైన పద్ధతులు ఎంపిక చేసుకుని ఎక్సర్‌సైజ్ చేయాలి. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు కచ్చితంగా డాక్టర్ సలహాలు పొందాలి. తెలిసీ తెలియకుండా వ్యాయామం చేస్తే ప్రమాదకరం. – మధుకృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు

డైట్ పాటించాలి



జిమ్‌కు వెళ్లే యువత తప్పనిసరిగా డైట్ పాటించాలి. ప్లాంట్ ప్రోటీన్ల కంటే యానిమల్ ప్రోటీన్‌లు, లిక్విడ్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవాలి. ఊబకాయులు పోషకాలు, విటమిన్లు అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం మంచిది. భోజనం చేసిన 3 గంటల తర్వాత మాత్రమే వ్యాయామం చేయాలి. మధ్యవయస్కులు వెజిటెబుల్స్, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవాలి. - **కేవీ సుచరిత, ప్రొఫెసర్, న్యూట్రీషియన్ విభాగం, ఎస్వీయూ**

ప్రత్యేక పద్ధతులతో శిక్షణ



ప్రతి వ్యక్తికి ప్రత్యేక పద్ధతులతో శిక్షణ ఇస్తాం. వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. నగరంలో చాలా జిమ్‌లు ఉన్నాయి. మంచి ప్రావీణ్యం గల ట్రైనర్స్ పర్యవేక్షణలోనే ఎక్సర్‌సైజు చేయాలి. మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, వెయిట్ లాస్ కేవలం జిమ్‌ల ద్వారానే సాధ్యం. వ్యాధిగ్రస్తులతో డాక్టర్ల సలహాల మేరకే వ్యాయామం చేయిస్తాం. – లెనిన్, జిమ్ ట్రైనర్

శ్రద్ధ చూపుతున్నారు



నగరంలో యువతతో పాటు మధ్యవయస్కులు పెద్ద సంఖ్యలో జిమ్‌లో చేరుతున్నారు. ప్రతి వ్యక్తికి నిపుణులైన ట్రైనర్స్‌తో శిక్షణ ఇస్తున్నాం. మహిళా ట్రైనర్లతో ప్రత్యేకంగా స్త్రీలకు శిక్షణ ఉంటుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలను కస్టమర్లకోసం తెప్పించాం. వ్యాయామం చేసే సమయంలో వినియోగదారుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తుంటాం. – వాసు రాయల్, జిమ్ నిర్వాహకులు

బీసీ ఉద్యోగుల సమావేశం



సమావేశంలో బీసీఈఎఫ్ నేతలు

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీ ఈఎఫ్ వ్యవస్థాపకుడు గోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టా భాస్కర్‌రావు మాట్లాడుతూ టీటీడీ ఎంప్లాయిస్ కో–పరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీ చేస్తున్న వంకీపురం పవన్‌కు బీసీలందరూ మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. బీసీఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పవన్ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతంగా నిర్వహించారన్నారు. పవన్ గెలుపుతో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడాలని కోరారు. సమావేశంలో తిరుమల కల్యాణ కట్ట సంఘం గౌరవాధ్యక్షుడు పెరుమాళ్, గాండ్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, సురేష్, మల్లికార్జున, ప్రసన్న యాదవ్, గిరి, శ్రీనివాస్, శ్రావణి, విశ్వనాథం, మురుగన్, మునీంద్ర, బాలకృష్ణ, జానకీరామ్, శేఖర్, రాజా పాల్గొన్నారు.

శ్రీవారికి సంగీత.. నృత్య నీరాజనం



సంకీర్తన ఆలపిస్తున్న కళాశాల అధ్యాపకులు వందన బృందం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరోజైన శనివారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు భక్తి సంకీర్తనలాపన, నృత్య ప్రదర్శనలతో స్వామివారికి ఘన నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొల్లూరు వందన బృందం భక్తి సంకీర్తనలను సుమధురంగా గానం చేసి, సభికులను మైమరిపించారు. వీరికి వయోలిన్‌పై ఎల్.జయరాం, మృదంగంపై కోటిపల్లి రమేష్ సహకారం అందించారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఉమ ముద్దుబాల స్వామివారి లడ్డూ, వడప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తిరుమల మాడ వీధుల్లో కళాశాలకు చెందిన 1200 మంది కళాకారులు 41 బృందాలు, తిరుపతి వేది కగా 250 మంది కళాకారులు పాల్గొని స్వామివారికి సంగీత, నృత్య సేవ చేశారని తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో 10 లక్షల మందికి సేవలు

- ఆర్టీసీకి రూ.9.69 కోట్ల రాబడి

తిరుపతి అర్బన్ : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ నేతృత్వంలో సుమారు 10 లక్షల మంది భక్తులకు సేవలు అందించారు. ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు 34,528 ట్రిప్పుల ద్వారా 10,77,273 మంది ప్రయాణికులను తిరుమలకు, అక్కడి నుంచి వారి గమ్యస్థానాలకు చేరవేశారు. తద్వారా రూ.9.69 కోట్లు ఆర్టీసీకి రాబడి చేకూరింది. తిరుపతి నుంచి తిరుమలకు 17,233 ట్రిప్పుల ద్వారా 4,71,914 మంది, తిరుమల నుంచి తిరుపతికి 17,295 ట్రిప్పుల ద్వారా 6,05,359 మంది ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ప్రయాణం చేశారు. సరాసరిగా ఒక్కొక్క ట్రిప్పునకు 31 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. వీరిలో 6,66,456 మంది ప్రయాణికులు శ్రీవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఘనంగా ఫైర్ అండ్ ఫెస్ట్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి కృతీశెట్టి

తిరుపతి కల్చరల్ : తిరుచానూరు రోడ్డులోని మామిడి కాయల మండీ సమీపంలో శనివారం విజయదశమిని పురస్కరించుకుని ఫైర్ అండ్ ఫెస్ట్ రెస్టారెంట్‌ను సినీ నటి కృతీ శెట్టి చేతులమీదుగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కుటుంబ సమేతంగా సంతృప్తిగా భోజనం చేసే సౌలభ్యంతో ఫైర్ అండ్ ఫెస్ట్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సంగీతాన్ని ఆస్వాదిస్తూ భోజనం చేసి అద్భుత అనుభూతిని పొందేలా వెసులుబాటు కల్పించారని వెల్లడించారు. రెస్టారెంట్ అధినేతలు ఎన్‌జీ ప్రవల్లిక, జి.మహేష్ మాట్లాడుతూ ప్రజలకు రుచికరమైన వంటకాలను అందించాలనే ఉద్దేశంతో ఫైర్ అండ్ ఫెస్ట్ రెస్టారెంట్ ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నరసింహయాదవ్, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, సీఎఫ్ఓ జ్యోతినాయుడు, లంకెళ్ల చిరంజీవి పాల్గొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–1997 విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాతిరెడ్డి, బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్‌శర్మ, చంద్రబాబు, విజేత, పూర్వ విద్యార్థులైన డాక్టర్ రమేష్, డాక్టర్ స్వర్ణలత, లెక్చరర్ కామమ్మ, నూరుల్లా, బ్రహ్మయ్య, చలపతి, చెన్నకేశవులు, సతీష్ పాల్గొన్నారు.



తుపాను నేపథ్యంలో అప్రమత్తం

- నేటి 'గ్రీవెన్స్' రద్దు

తిరుపతి తుడా : తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ నంబర్ 0877–2256766లో సంప్రదించాలని సూచించారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు అధికంగా కురిసే అవకాశముందని హెచ్చరించారు. ప్రజలకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేసినట్లు వివరించారు.

గ్రంథాలయంలో అధ్యయన తరగతులు

పాకాల : స్థానిక శాఖా గ్రంథాలయంలో బీఆర్ అంబేడ్కర్ అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తరగతులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. అతిథులు ఆర్.ఆనంద్, ఎన్.ప్రభాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలను పాటించాలని, జాతీయ గీతం, జెండాను గౌరవించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చైతన్య దయానంద బాబు, ఏడుకొండలు, రమేష్, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్ : కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ సహకారంతో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఆదివారం శిల్పారామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుభోదయం ఆస్పత్రి సిబ్బంది పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దామోదరం, డాక్టర్ రెడ్డెప్ప, వీవీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, డాక్టర్ గోవిందు, ఉమాపతి, అమ్మపల్లి నాయుడు పాల్గొన్నారు.

వైభవం.. దశమి సంబరం

తిరుపతి కల్చరల్ : నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా విజయదశమి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా తిరుపతిలోని కొంకావీధిలో వెలసని శ్రీకాళికా పరమేశ్వరికి షిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ఆధ్వర్యంలో సారె సమర్పించారు. అలాగే ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాలు, నగదు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, బాలకృష్ణ, మర్దం శివ, దుర్గం శ్రీను, సి.రమేష్, పి.విజయలక్ష్మి, హరిబాబు, కళావతి, ప్రభాకర్, రాణి పాల్గొన్నారు.



శిల్పారామంలో కళాకారుల ప్రదర్శన

పాకాల : దామలచెరువు పంచాయతీ మొబ్బినాయనపల్లెలోని ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. మొబ్బినేని చైతన్యకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ మొబ్బినేని రఘుపతి మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి ఉత్సవాలు జరిపించినట్లు వెల్లడించారు.

చంద్రగిరి(తిరుచానూరు): తిరుపతి నగరంలోని శిల్పారామంలో దసరా ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. సాయంత్రం తిరుపతికి చెందిన శివనాట్య కళానిలయం ఆధ్వర్యంలో కళాకారులు వినోద్, యువదర్శిని, మహాలక్ష్మి, తనియ, స్వప్న, చంద్రియ, రవీన్, భవిష్య, పూజిత, చాందిని, మోక్షశ్రీ, నిఖిత, లోహిత, రోహిత, చార్వి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ జ్ఞాపికలు అందించారు.

సాహితీ పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న రచయితలు, రైతులు

తిరుపతి కల్చరల్ : విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో గార్లపాటి దామోదర నాయుడు తమ తల్లిదండ్రులు, తాత పేరిట సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆదివారం రాస్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, సర్వోత్తమరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సాహితీ రచన మనిషి వ్యక్తిత్వ వికాసానికి గీటురాయి అని, సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల పేరుతో పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. రమేష్‌నాథ్ లింగుట్ల మాట్లాడుతూ తెలుగు భాషను బతికిస్తున్న కవులు, రచయితలను ప్రోత్సహించడం హర్షణీయమని చెప్పారు. అనంతరం కవులు, రచయితలు లంకిపల్లె కన్నయ్య నాయుడు, డాక్టర్ రామలక్ష్మి, జిల్లేళ్ల బాలాజీ, గుడివాడ అన్నమయ్య నాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, రైతులు కోటపాటి గంగాధరం, నరసింహులు నాయుడుకు గార్లపాటి సాహిత్య పురస్కారాలతో రూ.5 వేలు నగదు, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో కంపెల్ల రవిచంద్ర, తోట వెంకటేశ్వర్లు, యువశ్రీ మురళి, గాలి గుణశేఖర్, ఆర్‌సీ రాజు, ఉదయ్‌కుమార్, పరమేశ్వరయ్య, మస్తానమ్మ, సుహాసిని, కొణిదెల శోభ, సుభద్ర, ఎంఆర్. అరుణకుమారి, సహదేవ నాయుడు, డాక్టర్ మౌని, గొడుగు చింత గోవిందయ్య, తిరువాయిపాటి రాజగోపాల్, మోహన మునిసిద్ధారెడ్డి, పసలపల హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా 'ఉపాధి' పనులు





నిషిద్ధ ప్రాంతంలో సప్లయ్ చానల్ పనులు చేపట్టిన దృశ్యం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో ఉపాధి పనులను పలువురు అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. వివరాలు.. చిట్టిచెర్ల పంచాయతీ వద్ద ఏనుగుల కట్టడికి అటవీశాఖ ట్రెంచ్ ఏర్పాటు చేసింది. ఈ నిషిద్ధ ప్రాంతంపై అక్రమార్కుల కన్ను పడింది. అనుకున్నదే తడవుగా ఉపాధిలో సప్లయ్ ఛానల్ పనులు చేపట్టేందుకు అనుమతులు తెచ్చుకున్నారు. ట్రెంచ్‌ను చానల్‌గా మార్చేశారు. ఇక బిల్లులు చెల్లింపులే మిగిలి ఉన్నాయి. దీనిపై ఏపీఓ భార్గవిని వివరణ కోరగా.. చిట్టిచెర్ల పంచాయతీలో సప్లయ్ ఛానల్స్ పనులు జరుగుతున్నాయన్నారు. అటవీ ప్రాంతంలో పనులు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

బావిలో పడి కార్మికుడి మృతి

పాకాల: అస్సాం వలస కార్మికుడు బావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. దామలచెరువు పంచాయతీ జింకలమిట్టలోని స్నామ్ అలాయిస్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న దిగన్ బర్దోలై(32) ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. సహచర కార్మికులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చంద్రగిరి: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం తొండవాడ సమీపంలో జరిగింది. వివరాలు.. చంద్రగిరి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న హిదయతుల్లా విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. హిదయతుల్లా కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.